నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
5 | హైదరాబాద్, ఆదివారం 7 జనవరి 2024 | SANGAREDDY

ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఈ లైబ్రరీ ప్రారంభం

ములుగు, జనవరి 6: సిద్దిపేట జిల్లా ములుగు శ్రీ కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో శనివారం పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల కోసం ఈ లైబ్రరీని ఉపకులపతి డాక్టర్ బి.నీరజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ లైబ్రరీని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశంలోని ఉద్యాన విశ్వవిద్యాలయాల్లో మొదటి సారి అత్యాధునిక ఈ లైబ్రరీని ప్రారంభించుకోవడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో అధికారులు రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, డాక్టర్ ఎ.కిరణ్‌కుమార్, డాక్టర్ డి.విజయ, డాక్టర్ ఎం.రాజశేఖర్, డాక్టర్ నటరాజన్, డాక్టర్ శ్రీనివాసన్, బి.నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈ లైబ్రరీని ప్రారంభిస్తున్న ఉపకులపతి డాక్టర్ నీరజా

ఆరు గ్యారెంటీలు అమలుచేస్తాం

ఆరోగ్యశ్రీ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం జీవం పోస్తుంది

జోనల్ మార్పు విషయంలో కమిటీ వేద్దాం

వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ

మెదక్ పట్టణం, తూప్రాన్, నర్సాపూర్ మండలం రుస్తుంపేట్‌లో ప్రజాపాలనలో పాల్గొన్న మంత్రి

మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి

నర్సాపూర్‌లో బ్లడ్ బ్యాంక్, డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి విజ్ఞప్తి

సానుకూలంగా స్పందించిన మంత్రి

నర్సాపూర్ మండలం రుస్తుంపేట్‌లో దరఖాస్తుదారులకు అక్‌నాలెడ్జ్‌మెంట్‌ను అందజేస్తున్న మంత్రి దామోదర రాజనరసింహ, పక్కన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

మెదక్, జనవరి 6 (నమస్తే తెలంగాణ)/ నర్సాపూర్ : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆరు గ్యారెంటీలు అమలు చేయడమే ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం ప్రజాపాలన చివరి రోజులో భాగంగా మెదక్ పట్టణంలోని సాయిబాలాజీ గార్డెన్స్‌లో దరఖాస్తులు స్వీకరించి, సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజులకే మహిళల కోసం ఉచిత బస్ పథకాన్ని తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. ఆరు గ్యారెంటీలను త్వరలోనే ఆచరణలోకి తీసుకువస్తామని, రూ. 10 లక్షలతో ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇల్లు, ఇండ్ల స్థలాలు పేదలకు అందజేస్తామన్నారు. విద్యా, వైద్యం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని తెలిపారు.

మెదక్‌ను చార్మినార్ జోన్‌లో కలపాలి

– ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలిపేలా కృషి చేయాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మంత్రి దామోదర రాజనర్సింహకు విన్నవించారు. ఆరు గ్యారెంటీలను ఎట్టిపరిస్థితుల్లోనూ అమలు చేయాలని సూచించారు. గత ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిందని, వాటికి టెండర్లను ఆహ్వానించి పనులు పూర్తిచేసేందుకు సహకరించాలన్నారు. నర్సాపూర్ ఏరియా దవాఖానలో సిబ్బందిని పెంచి, డయాలసిస్ సెంటర్, బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం...

– ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. మంత్రి సహకారంతో మెదక్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ రమేశ్, ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, ప్రజాపాలన స్పెషల్ అధికారి జయరాజ్, డీపీఆర్‌వో ఏడుకొండలు, మెదక్ తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ జానకీ శ్రీరాం, మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, కౌన్సిలర్లు ఆర్‌కె శ్రీను, లక్ష్మీ నారాయణగౌడ్, ఆవారి శేఖర్, దాయర లింగం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోనల్ మార్పుపై కమిటీ వేద్దాం..

మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలన్న డిమాండ్‌ను రాజకీయాలకతీతంగా ఓ కమిటీ వేసి ప్రభుత్వానికి దరఖాస్తు అందజేసి పరిష్కరించుకుందామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం నర్సాపూర్ మండలం రుస్తుంపేట, తూప్రాన్ మున్సిపాలిటీ 16వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాలకు మంత్రి హాజరయ్యారు. రుస్తుంపేటలో స్థానిక ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, కలెక్టర్ రాజర్షి షాతో కలిసి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి అక్‌నాలెడ్జ్‌మెంట్ పత్రాలను దరఖాస్తులదారులకు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వాలు ప్రజాసంక్షేమం కోసం పనిచేయాలని, నాణ్యమైన విద్యా, వైద్యం అందించాలన్నారు. నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానలో బ్లడ్‌బ్యాంక్, డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించారు.

ప్రజాపాలనపై అవగాహన కల్పించాం..

– మెదక్ కలెక్టర్ రాజర్షి షా

ప్రజాపాలన దరఖాస్తులపై గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించామని మెదక్ కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 469 గ్రామ పంచాయతీలు, 78 వార్డుల్లో దరఖాస్తులు తీసుకున్నామని, ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేశ్, జడ్పీ కో-ఆప్షన్ మెంబర్ మన్సూర్, గ్రామసర్పంచ్ విజయభాస్కర్‌రాజు, ఎంపీపీ జ్యోతీ సురేశ్‌నాయక్, ఎంపీటీసీ లక్ష్మీ అశోక్, ఆర్‌డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ కమలాద్రి, ఎంపీడీవో మార్టిన్ లూథర్, జడ్పీటీసీ బాబ్యానాయక్, నాయకులు ఆవుల రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్, చంద్రశేఖర్, నయీమొద్దీన్, సుహాసిని రెడ్డి, గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.

కల్యాణం చూతమురారండి

నేడు కొమురవెల్లి 'మల్లికార్జునుడి' కల్యాణం

మల్లన్న కల్యాణ వేదిక వద్ద ముస్తాబు చేస్తున్న కార్మికులు

- **పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్న మంత్రి కొండా సురేఖ**
- **హాజరుకానున్న రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**
- **కొమురవెల్లికి భారీగా తరలిరానున్న భక్తులు**

గర్భ గుడిలో కొలువుదీరిన స్వామివారు

చేర్యాల, జనవరి 6 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించనున్నారు. రాష్ట్ర నలుమూలలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కానున్నారు.మల్లన్న కల్యాణానికి రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌తో కలిసి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు హాజరుకానున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

వైభవంగా కల్యాణం

ఆలయ సంప్రదాయం మేరకు వరుడు మల్లికార్జునస్వామి తరపున పడిగన్నగారి వంశస్తులు పి.మల్లికార్జున్ దంపతులు, వధువులు మేడలాదేవి, కేతమ్మదేవి తరపున మహాదేవుని వంశస్తులు మహాదేవుని మల్లికార్జున్ దంపతులు పాల్గొననున్నారు. ఉదయం 10:45 గంటలకు కొమురవెల్లి ఇంద్రకీలాద్రి ఆలయ ప్రాంగణంలోని తోట బావి వద్ద నిర్మించిన కల్యాణ వేదికలో మధ్యప్రదేశ్ ఉజ్జయిని పీఠాధిపతి సిద్ధలింగరాజు దేశికేంద్ర శివాచార్య ఆధ్వర్యంలో కల్యాణం జరుగనుంది. ఆదివారం వేకువజామున ఐదు గంటలకు స్వామివారికి దృష్టికుంభం (బలిహరణం), 10.45 గంటలకు స్వామివారి కల్యాణం, మధ్యాహ్నం 12 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి ఏడు గంటలకు రథోత్సవం (బండ్లు తిరుగుట), సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, అనంతరం మహామంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ ఉంటుంది.

వేలాదిగా తరలి రానున్న భక్తులు

స్వామి వారి కల్యాణోత్సవానికి 30వేల మంది భక్తులు హాజరయ్యే అవకాశమున్నందున ఆలయ వర్గాలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. 60వేల లడ్డూ ప్రసాదాలతోపాటు ఐదు క్వింటాళ్ల పులిహోర ప్యాకెట్లు తయారు చేశారు. రెగ్యులర్ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మొత్తం 70 మంది, 100 మంది వలంటీర్లు విధులు నిర్వహించనున్నారు. ప్రభుత్వశాఖల అధికారులు సైతం పనులను పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఆర్టీసీ బస్సులే కాకుండా సిద్దిపేట, జనగామ జిల్లా కేంద్రాల నుంచి ప్రత్యేకంగా నడిపించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 300 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

పారదర్శకంగా పథకాల అమలు

రాజకీయాలకతీతంగా హుస్నాబాద్ అభివృద్ధి

త్వరలోనే గౌరవెల్లి రిజర్వాయర్ డిస్ట్రిబ్యూటరీ కాల్వ నిర్మాణ పనులు

హుస్నాబాద్ ఆర్టీసీ డిపోను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ ప్రజాపాలనలో పాల్గొన్న మంత్రి

హుస్నాబాద్, జనవరి 6: సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేసేందుకే ప్రజా పాలనలో భాగంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ మల్లెచెట్టు చౌరస్తాలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో శనివారం జరిగిన ప్రజాపాలనలో ఆయన పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాపాలనలో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 85వేల దరఖాస్తులు వచ్చాయన్నారు.ఎన్ని సమస్యలు ఎదురైనా ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదన్నారు. రాజకీయాలకతీతంగా హుస్నాబాద్ పట్టణంతో పాటు అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. హుస్నాబాద్ పట్టణంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. మున్సిపల్ పరిధిలోని హమాలీలకు హెల్త్ ప్రొఫైల్ తయారు చేసేందుకు అవసరమైన వైద్య పరీక్షలు చేయించేలా వైద్యులతో మాట్లాడినట్లు చెప్పారు. త్వరలోనే రూ.250కోట్లతో గౌరవెల్లి రిజర్వాయర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణం చేపడుతామని తెలిపారు. హుస్నాబాద్ ఆర్టీసీ డిపోను ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితా వెంకట్ , వైస్ చైర్ పర్సన్ అయిలేని అనితారెడ్డి, ఆర్డీవో బెన్‌షాలోమ్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఏసీపీ సతీశ్, సీఐ ఎర్రల కిరణ్, కమిషనర్ రాజశేఖర్, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, దొడ్డి శ్రీనివాస్, సరోజన, వల్లపు రాజు, అయిలేని శంకర్‌రెడ్డి, ఎండీ అయూబ్, శ్రీలత, మున్సిపల్ ఆర్ఐ కృష్ణ, మెప్మా ఇన్‌చార్జి రాజు పాల్గొన్నారు.

హుస్నాబాద్ 14వ వార్డులో మంత్రి మార్నింగ్ వాక్

హుస్నాబాద్ పట్టణంలోని 14వ వార్డులో శనివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ మార్నింగ్ వాక్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులతో కలిసి వార్డులోని పలు వీధులను స్వయంగా పరిశీలించారు.వార్డులో ఇంకా కావాల్సిన అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. హమాలీలతో సమావేశం నిర్వహించి వారి సమస్యలపై ఆరాతీశారు. ఆయన వెంట సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి ఉన్నారు.


హుస్నాబాద్ మార్నింగ్ వాక్‌లో ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

ముగిసిన ప్రజాపాలన

- **మెదక్ జిల్లాలో 2.73 లక్షలు, సంగారెడ్డిలో 3.83 లక్షలు, సిద్దిపేటలో 3,76 లక్షల దరఖాస్తులు**
- **పలుచోట్ల మొదలైన డాటా ఎంట్రీ**
- **17 వ తేదీ వరకు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ**
- **గ్యారెంటీ పథకాలపై ప్రజల్లో ఆశలు**

మెదక్/ సంగారెడ్డి, (నమస్తే తెలంగాణ)/సిద్దిపేట అర్బన్, జనవరి 6: ప్రజాపాలనకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఆరుగ్యారెంటీ పథకాల కోసం ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. గత నెల 28వ తేదీన ప్రారంభమైన కార్యక్రమం 6వ తేదీతో ముగిసింది. ఆయా ప్రాంతాలకు వలస వెళ్లిన వారు సైతం సొంతూరుకు వచ్చి దరఖాస్తులు సమర్పించారు. మెదక్ జిల్లాలో మొత్తం 469 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి అవగాహన కల్పించారు. చివరి రోజు శనివారం వరకు మొత్తం 2,73,389 దరఖాస్తులు వచ్చాయి.

మెదక్ జిల్లా జీపీల్లో 425 బృందాలు..

మున్సిపాలిటీల్లో 55 బృందాలు...

మెదక్ జిల్లాలోని 425 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల్లో 55 బృందాలు ఏర్పాటు చేశారు. దరఖాస్తులను వెబ్‌సైట్‌లో నమోదు చేసేందుకు 319 మంది ప్రభుత్వ, 161 ప్రైవేట్ డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించారు. ఈ నెల 17 వరకు దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

సిద్దిపేట జిల్లాలో 3,76,387 దరఖాస్తులు

అభయహస్తం పథకంలో భాగంగా సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఎనిమిది రోజుల్లో 3,76,387 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. గృహజ్యోతి, పింఛన్లు, రైతుభరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు స్వీకరించారు.

సంగారెడ్డి జిల్లాలో 3,83,979 దరఖాస్తులు

జిల్లాలోని 647 పంచాయతీలు, 8 మున్సిపాలిటీల్లో నిర్వహించిన ప్రజాపాలనలో అధికారులు 3,83,979 దరఖాస్తులు స్వీకరించారు. అత్యధికంగా పింఛన్లు, రేషన్‌కార్డులు, మహాలక్ష్మి కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ఈసారి 'ఆన్‌లైన్'లోనే ప్రదర్శనలు

ఈనెల 18 వరకు 'ఇన్‌స్పైర్ మనక్' ప్రాజెక్టుల అప్‌లోడ్

ఉమ్మడి మెదక్ జిల్లాలో 287 ప్రాజెక్టులు ఎంపిక

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 6: పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల ఆలోచనలకు పదును పెట్టి భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ ఏటా 'ఇన్‌స్పైర్ మనక్' పోటీలు నిర్వహిస్తోంది. 2022-23 సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. జాతీయస్థాయిలో ఉత్తమ ఆలోచనలను ఎంపిక చేసి విద్యార్థుల ఖాతాల్లో రూ.10 వేల చొప్పున జమ చేశారు. జిల్లాస్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శన గత నవంబర్‌లో ఏర్పాటు చేయాల్సి ఉండగా.. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడ్డాయి. సమయం లేకపోవడంతో ఈసారి ఆన్‌లైన్‌లో ప్రదర్శనలు ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈనెల 18లోగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో ప్రాజెక్టులు నిక్షిప్తం చేయాల్సి ఉంటుంది. ఈనెల 19 నుంచి 25 వరకు మూల్యాంకనం చేస్తారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనభర్చిన వాటిలో జనవరి 26న రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రాజెక్టుల వివరాలు ప్రకటిస్తారు. 26 నుంచి 31 వరకు రాష్ట్రస్థాయి పోటీలకు యాప్‌లో వివరాలు నమోదు చేయాలి. ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు మూల్యాంకణం, అనంతరం జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టుల జాబితాను విడుదల చేస్తారు.

రూ.10 వేల చొప్పున ఖాతాల్లో జమ..

వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనేందుకు ఏటా విద్యార్థులు పోటీ పడుతున్నారు. ఉపాధ్యాయుల సహకారంతో నూతన ఆవిష్కరణలు రూపొందిస్తున్నారు. గతేడాది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించగా ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి 287 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. (మెదక్ జిల్లా నుంచి 45, సిద్దిపేట జిల్లా నుంచి 156, సంగారెడ్డి జిల్లా నుంచి 96) పరిశోధనకు అవసరాల నిమిత్తం రూ.10 వేల చొప్పున విద్యార్థుల ఖాతాల్లో జమ చేయడం జరిగింది.

షెడ్యూల్ ఇలా..

- ఈనెల 2 నుంచి 18వ తేదీ వరకు యాప్‌లో ప్రాజెక్టు వివరాల నమోదు.
- 19 నుంచి 25వ తేదీ వరకు మూల్యాంకనం.
- 28 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీలకు యాప్‌లో అప్‌లోడ్ చేయడం.
- ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు మూల్యాంకనం
- అనంతరం జాతీయస్థాయి జాబితా విడుదల

ఈనెల 18వతేదీ వరకు గడువు

ఇన్‌స్పైర్ మనక్ 2022-23 సంవత్సరానికి ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 18లోగా www.inspireawards.dst.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. లక్ష్యం నెరవేరేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలి. సృజనాత్మకమైన ఆలోచనలు వాటి పరిష్కారాలను కనుగొనే దిశలో యోచించాలి. వినూత్న ఆలోచనలతో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రత్యేకతను చాటేందుకు ఉత్సాహంగా ముందుకు రావాలి. ఏమైనా సాంకేతిక సమస్యలు ఉంటే సంప్రదించాలి.

– రాజిరెడ్డి, మెదక్ జిల్లా సైన్స్ అధికారి

అందరికీ అందుబాటులో ఉంటా

ప్రజలకు ఏ సమస్య ఉన్నా నేరుగా కలవొచ్చు

గంజాయి, మత్తు పదార్థాలు, అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి

మెదక్ నూతన ఎస్పీ డాక్టర్ బి.బాలస్వామి

జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ

జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న బి.బాలస్వామి

మెదక్, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : ప్రజల సేవ కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఎవరికి ఏ సమస్య ఉన్నా తనను నేరుగా కలవొచ్చని మెదక్ ఎస్పీ డాక్టర్ బి.బాలస్వామి అన్నారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నూతన ఎస్పీ డాక్టర్ బి.బాలస్వామిని అదనపు ఎస్పీ అడ్మిన్ ఎస్. మహేందర్ పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజాశాంతికి భంగం కలిగించాలని చూస్తే ఊరుకునేది లేదని, జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాలు, అక్రమ కార్యకలాపాలు, రోడ్డుప్రమాదాలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వివిధ రకాల అభ్యర్థనలు, ఫిర్యాదులు, సమాచారం, సహాయం కోసం వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాద, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. 2018 ఐపీఎస్ బ్యాచ్‌కి చెందిన డాక్టర్ బి.బాలస్వామి కాగజ్‌నగర్‌లో ఇన్‌చార్జి ఎస్‌డీపీవోగా పనిచేశారు. 2021 నవంబర్‌లో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్‌గా విధులు నిర్వర్తించి, ఇక్కడి నుంచి రాచకొండ కమిషనరేట్‌లో ఎస్‌బీడీసీపీగా, అనంతరం సౌత్ వెస్ట్ జోన్ హైదరాబాద్ సిటీ డీసీపీగా పనిచేసిన ఆయన ప్రస్తుతం మెదక్ ఎస్పీగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాకు వచ్చిన ఎస్పీ డాక్టర్ బి.బాలస్వామిని మెదక్ డీఎస్పీ ఫణీంద్ర, తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి, డీసీఆర్‌బీడీ ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సైబర్ సెల్ డీఎస్పీ ఎస్ఆర్. సుభాష్ చంద్రబోస్, ఏఆర్ డీఎస్పీ ఎస్ఆర్ రంగ నాయక్, జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు ఏఆర్ఎస్ఐలు, డీపీవో సిబ్బంది కలిశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9640400073/9160900024.
NT-319407-All

OWN BUSINESS OFFER

★18-28 సం॥ల యువతీ యువకులకు Rs. 49,000/- ల స్వల్ప పెట్టుబడిలోనే లోకల్ ఫ్రాంచైజీతో పర్మినెంట్ బిజినెస్ ఆదాయం. మల్టీసర్వీసెస్+ట్రైనింగ్+డైలీ సపోర్ట్ @ 15 సం॥ల నమ్మకమైన సర్టిఫైడ్ సంస్థ W.W.I-Hyd. Ph: 9908743603.
NT-2580-All

CHANGE OF NAME

★I, PATLOLLA VAMSHIDHAR REDDY, S/o. Patlolla Upender Reddy, R/o. H.No. 1-70, Jinnaram Mandal, Amdoor, Medak, Telangana, Pin-502 296. I My Educational Documents My Name mentioned as PATLOLA VAMSHIDHAR REDDY. Both PATLOLLA VAMSHIDHAR REDDY & PATLOLA VAMSHIDHAR REDDY belongs to me & one only.
NT-320584

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.